# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-09-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. జాతీయ సరస్ ఆజీవిక మేళా మహిళా స్వయం సహాయక సంఘాలకు జాతీయ స్థాయి మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

**2. వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన చోదకశక్తిగా నిలవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు.**

**3. పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

**4. ఏఐ సాంకేతికతను వినియోగించి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని కొత్త దిశలో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించనున్న జాతీయ సరస్ ఆజీవిక మేళా మహిళా స్వయం సహాయక సంఘాలకు జాతీయ స్థాయి మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడ కలెక్టరేట్‌లో మేళా నిర్వహణపై నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లో 600 స్టాళ్లతో మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 2 వేల 500 మంది మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని తెలిపారు. చేనేత, హస్తకళలు, ఆహార పదార్థాలు, సహజ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించనున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరిస్తూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన చోదకశక్తిగా నిలవాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిన్న జరిగిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గుజరాత్ పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని కోరారు. వేగం, విధానాల్లో స్థిరత్వం, మెరుగైన సేవలు

పెట్టుబడిదారులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 23 రంగాల వారీగా క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇంధన, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఫార్మా, రక్షణ, డ్రోన్లు, ఆక్వా తదితర రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిసి పనిచేస్తే మరిన్ని అవకాశాలు సృష్టించవచ్చని మంత్రి అన్నారు.

--------------------------

ఆర్యదాన్ ముహమ్మద్ స్ఫూర్తితో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. కేరళంలోని నిలంబూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన 'ఆర్యదాన్ ముహమ్మద్-2026' అవార్డును నిన్న స్వీకరించారు. ఆలప్పుజా పార్లమెంట్ సభ్యులు కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్యదాన్ ముహమ్మద్ గొప్ప రాజకీయ నాయకుడని, ఎనిమిదిసార్లు శాసనసభ్యులుగా, నాలుగుసార్లు మంత్రిగా సేవలందించారని గుర్తుచేశారు.

--------------------------

దేశీయ ఆయిల్‌పామ్ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముడి పామాయిల్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక, వ్యవసాయ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రులకు లేఖలు రాశారు. తెలంగాణలో లక్షా 29 వేల హెక్టార్లలో 88 వేల 621 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. దిగుమతి సుంకం తగ్గింపు వల్ల దేశీయ పామాయిల్ ధరలు, తద్వారా రైతులకు లభించే ఎఫ్ఎఫ్‌బీ ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులను ఆయిల్‌పామ్ వైపు ప్రోత్సహిస్తూ, ధరలకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

--------------------------

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4వ వార్డుల్లో 13 లక్షల 26 వేల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ...

వాయిస్..25.. సెకన్లు

--------------------------

ఏఐ సాంకేతికతను వినియోగించి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని కొత్త దిశలో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రేపు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 130కిపైగా పర్యాటక ప్రాంతాల్లో ఏఐ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు. వీటి ద్వారా 130కిపైగా భాషల్లో పర్యాటకులకు సమాచారం అందుతుందన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని 'ది గోదావరి కాల్స్' ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

--------------------------

జాతీయవాది, దేశభక్తుడు, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి ఈరోజు. 1867వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా- ఖండవల్లి గ్రామంలో ఆయన జన్మించారు. లక్ష్మీ నరసింహం, సంఘసేవతో పాటు 'దేశమాత', 'మనోరమ', 'సరస్వతి' వంటి పత్రికలను స్థాపించి వాటిని సాంఘిక, రాజకీయ చైతన్య అస్త్రాలుగా వినియోగించి స్వాతంత్ర్యోద్యమం పట్ల ప్రజలను జాగృతం చేశారు. పత్రికా నిర్వహణతో పాటు పలు రచనలు చేశారు. ఆయన రచించిన "గయోపాఖ్యానము" నాటకం, "గణపతి నవల బహుళ ప్రాచుర్యం పొందాయి. సామాజిక పరిణామాలను చరిత్రకారుడుగా తన రచనల్లో పొందుపరిచిన చిలకమర్తి లక్ష్మీనరసింహం 1946 జూన్ 17వ తేదీన తన 79వ ఏటా కన్నుమూశారు.

--------------------------

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఆంధ్రప్రదేశ్‌లోని నాగావళి, వంశధార, గోదావరి, కృష్ణా నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నిన్న సాయంత్రానికి గోదావరి ఇన్‌ఫ్లో, 4.11 లక్షల క్యూసెక్కులుగా ఉందని చెప్పారు. ఈరోజు రాత్రికి వరద ప్రవాహం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం ఉందని, రేపు రాత్రి నుంచి క్రమంగా తగ్గే అవకాశం ఉందన్నారు. కృష్ణా నదిలో స్వల్పంగా వరద ప్రవాహం కొనసాగుతున్నందున ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు. లోతట్టు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈరోజు శ్రీకాకుళం, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

మరోవైపు తెలంగాణలోనూ ఈ రోజు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరి వేదికగా జరుగుతున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. నిన్న జరిగన మ్యాచ్‌లో వైజాగ్ ఫైర్ బర్డ్స్‌ను 27 పరుగుల తేడాతో ఓడించి గోదావరి గోల్డెన్ ఈగల్స్ జట్టు ఫైనల్‌కు చేరింది. సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో అమరావతి ఈ ఛాంపియన్స్ జట్టుపై రాయలసీమ జెన్‌స్టార్స్ 32 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్‌కు చేరింది. రేపు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో గోదావరి గోల్డెన్ ఈగల్స్, రాయలసీమ జెన్‌స్టార్స్ జట్లు పోటీ పడనున్నాయి.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 138వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్ అంతటా, న్యూస్ ఆన్ ఎ.ఐ.ఆర్.జీ.వో.వి.ఇన్, న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, న్యూస్ ఆన్ ఎ.ఐ.ఆర్, డి డి న్యూస్, పి. యం.వో, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల యు ట్యూబ్ ఛానెళ్లలో కూడా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారమవుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే.. ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

====================